క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. యాదవనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ముచ్చర్ల క్రాస్ రోడ్డు, ఆర్‌కే.హోటల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

16న డ్రాయింగ్ పోటీలు

హన్మకొండ చౌరస్తా: ఈనెల 16వ తేదీన హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రత్యేకతలు అనే అంశంపై పోటీలు ఉంటాయని, ఆసక్తి గల విద్యార్థులు 81436 43337 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భిక్షపతికి ప్రీమియర్ అవార్డు



హన్మకొండ చౌరస్తా: జిల్లాకు చెందిన సంగీత దర్శకుడు హనుమకొండ భిక్షపతికి నేషనల్ ప్రీమియర్ అవార్డును నేను సైతం ఫౌండేషన్ అందజేసింది. హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు శేషు చేతుల మీదుగా అవార్డును భిక్షపతి అందుకున్నాడు. కార్యక్రమంలో రవిశ్రీ యూనివర్సిటీ డైరెక్టర్ పరిపెల్లి రవి, గౌరి పాల్గొన్నారు.

'జూ పార్కు తరలించాలనే ప్రకటన వెనుక కుట్ర'

హన్మకొండ: కేసీఆర్ ప్రభుత్వం సెంట్రల్ జైల్‌ను ధ్వంసం చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం జూపార్కును తరలించాలని చూస్తోందని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ మహానగర ప్రజలతో పాటు, జిల్లాకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్న హనుమకొండలోని కాకతీయ జువాలజికల్ పార్కును తరలించాలని చూడడం అనాలోచిత చర్య అని పేర్కొన్నారు. సైన్స్ సెంటర్ అభివృద్ధి మరిచి దానికి ఎదురుగా ఉన్న జూపార్కుపై కాంగ్రెస్ నాయకులు కన్నేశారని తెలిపారు. పార్కును ధర్మసాగర్‌కు తరలించాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ప్రకటించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆరోపించారు.

'దాడిని సహించబోం'

హన్మకొండ: పార్టీ కార్యాలయాలపై దాడిని సహించేది లేదని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఏ పార్టీ అయినా పార్టీ కార్యాలయాలు వారికి దేవాలయాల వంటివని అన్నారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతోందని, ఈ క్రమంలోనే కాంగ్రెస్ శ్రేణులు కార్యాలయంపై దాడి చేశారని ధ్వజమెత్తారు. భువనగిరి పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిని పార్టీ నాయకులు జోరిక రమేష్, పులి రజనీకాంత్, బైరపాక ప్రశాంత్ ఖండించారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



మడికొండ: 2004 – 2005వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న ఎలేంద్ర అనారోగ్యంతో ఈనెల 2న మృతి చెందారు. ఈమేరకు మృతుడి చిన్ననాటి స్నేహితులు రూ.32 వేలను సేకరించి అతని కుమార్తె వైష్ణవి పేరుపై డిపాజిట్ చేసి ఆ పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో జిట్ట అనిల్, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంహెచ్‌నగర్‌లో వైద్యశిబిరం



దేశాయిపేట: నగరంలో 13వ డివిజన్ ఎంహెచ్ నగర్ కాలనీలో ఎస్ఎస్‌సీ హెల్త్‌కేర్ సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ సురేష్‌కుమార్ జోషి ఆదివారం ప్రారంభించారు. లేబర్ కార్డు ఉన్నవారితో పాటు స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రవితేజ, అలకుంట సంపత్ కుమార్, డాక్టర్ సాగరిక, రవళిక, స్థానికులు కంచ రాజు, కొమరవెల్లి నాగరాజ్, బొల్లు సంతోష్, సుంచు కృష్ణ, పిండం శంకర్‌లింగం, రవి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీని బలోపేతం చేయాలి

విద్యారణ్యపురి: విద్యా వెల్ఫేర్ సొసైటీని బలోపేతం చేయాలని సొసైటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్‌వీఎన్.చారి కోరారు. హనుమకొండలోని విజయగణపతి నగర్‌లోని విద్యా వెల్ఫేర్ సొసైటీ 42వ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కోశాధికారిగా రవికుమార్.. ఆర్థిక నివేదికలను చదివి సభ్యులకు వినిపించారు.

అధ్వానంగా కడిపికొండ ఆర్వోబీ

- గుంతలతో వాహనదారుల ఇక్కట్లు
- ప్రమాదకరంగా ఇనుప చువ్వలు



గుంతలు పడిన ఆర్వోబీ



బ్రిడ్జిపై గుంతల్లో తేలిన ఇనుప చువ్వలు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలంలోని కడిపికొండ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)పై రహదారి అధ్వానంగా తయారైంది. కాజీపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్లే జాతీయ రహదారిని ఆనుకుని నిర్మించిన కడిపికొండ ఆర్వోబీ నుంచి వరంగల్, ఖమ్మం వైపు వెళ్లొచ్చు. ఈక్రమంలో నగరంలోకి రాకుండానే కడిపికొండ ఆర్వోబీపై నుంచి వందలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కడిపికొండ ఆర్వోబీపై ఏర్పడిన గుంతల్లో ఇనుప చువ్వలు ప్రమాదకరంగా పైకి తేలి ఉన్నాయి. దాంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ గుంతలను అధికారులు రెడీమిక్స్‌తో తూతూమంత్రంగా పూడ్చి చేతులు దులుపుకున్నారు. కొన్ని చోట్ల రెడీమిక్స్‌ను బ్రిడ్జికి సమాంతరంగా కాకుండా ఎత్తుగా పోయడంతో అది స్పీడ్ బ్రేకర్ల మాదిరిగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రౌడీలు సత్ప్రవర్తనతో మెలగాలి

- వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరాంనాయక్



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న ఏసీపీ

ఖిలా వరంగల్: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, భూ కబ్జాలు, అల్లర్లు, గొడవల్లో తలదూర్చితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరాంనాయక్ హెచ్చరించారు. వరంగల్ ఏసీపీ కార్యాలయంలో మిల్స్ కాలనీ ప్రాంతానికి చెందిన 40 మంది రౌడీషీటర్లకు ఏసీపీ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కుటుంబంతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని వారికి సూచించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, ఎస్సైలు శ్రీకాంత్, రవీందర్, సురేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కాజీపేట అర్బన్: 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేటలోని దోనగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేపట్టారు. దోనగుట్ట అభివృద్ధికి రూ.54 లక్షల నిధులు కేటాయించినట్లు ఆమె వివరించారు. గోదాదేవి కల్యాణ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాలయ ఆవరణలో గోశాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ మామిండ్ల రాజు, వేల్పుల మోహన్‌రావు, వెంకన్న, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ఉమామహేశ్వరి

మడికొండ: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 5వ తరగతిలో ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి 2025 – 26వ విద్యా సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకులాల్లో దరఖాస్తు చేసుకోవాలని మడికొండ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 23వ తేదీన కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 1వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఉమామహేశ్వరి సూచించారు.

దరఖాస్తు చేసుకోవాలి

హన్మకొండ: ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి సూచించారు. హనుమకొండ టీవీ టవర్ కాలనీలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ ప్రవేశాల కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా గురుకుల్లో విద్యాబోధన అందిస్తున్నట్లు కార్పొరేటర్ వివరించారు. ఈ కార్యక్రమంలో మడికొండ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఉపాధ్యాయురాలు కె.రజనీప్రియ కాలనీవాసులు నోముల మల్లారెడ్డి, పూజారి మనోజ్‌కుమార్ గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్



ప్రభాకర్



కుమారస్వామి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఇద్దరు పరిశోధకులు బి.ప్రభాకర్, కుమారస్వామికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఎ స్టడీ ఆన్ ఎఫెక్ట్ ఆఫ్ సర్క్యూట్ ట్రెనింగ్ ఆన్ వేరియాస్ స్కిల్స్ ఆఫ్ కబడ్డీ ప్లేయర్స్ ఆఫ్ వరంగల్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ప్రభాకర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. వరంగల్ కిట్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి పర్యవేక్షణలో ప్రభాకర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, ఏ స్టడీ ఆన్ ఎఫెక్ట్ ఆఫ్ పాలీమెట్రిక్ ట్రెనింగ్ ఆన్ సెలెక్టెడ్ మోటార్ ఫిట్‌నెస్ అండ్ సైకాలజికల్ వేరియబుల్స్ ఆఫ్ కబడ్డీ ప్లేయర్స్ అనే అంశంపై విశ్రాంత ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కుమారస్వామికి డాక్టరేట్ ప్రదానం చేశారు.

నర్సిరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి



ప్రచారం చేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మరోసారి ఎన్నికల బరిలో ఉండబోతున్నారని, ఈక్రమంలో ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి మరలా గెలిపించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, బాధ్యులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీలో పరీక్షల విభాగం సమీపంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు లెక్చరర్లు డాక్టర్ నవీన్, రవీందర్, కుమారస్వామి, కవిత, హరిశంకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ వాసులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రమేష్‌బాబు, సరిత

హన్మకొండ చౌరస్తా: బత్తుల రమేష్‌బాబు బిందాస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమకొండ 4వ డివిజన్‌లోని జ్యోతిబసునగర్ కాలనీలోని పేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ బత్తుల రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ట్రస్ట్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పేదలకు దుప్పట్ల పంపిణీతో పాటు, ఉచిత వైద్య శిబిరం కూడా నిర్వహించి మందులు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్పర్సన్ బత్తుల సరిత, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం బాధ్యులు శ్రీధర్‌యాదవ్, సమ్మన్న, రమేష్, నరేందర్, మహేందర్, సురేష్, రాజ్‌కుమార్, మహేష్, శ్రీను, సీహెచ్.రాజు, నవీన్, రమేష్, వెంకట్, సతీష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

డీఎస్ఏ క్రికెట్ కోచ్ అప్జల్‌కు సన్మానం



క్రికెట్ కోచ్‌ను సన్మానిస్తున్న ఉదయభానురావు

వరంగల్ స్పోర్ట్స్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని వరంగల్ క్రికెట్ సంఘం మాజీ కార్యదర్శి మార్నేని ఉదయ భానురావు ఆధ్వర్యంలో హనుమకొండ డీఎస్ఏ క్రికెట్ కోచ్ ఎండీ.అప్జల్‌ను జేఎన్ స్టేడియంలోని క్రికెట్ మైదానంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా క్రికెట్ క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. నిత్య సాధన, పట్టుదల, క్రమశిక్షణతో ఐపీఎల్ స్థాయికి ఎదగాలని క్రీడాకారులకు ఉదయ భానురావు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రికెటర్లు బండారి ప్రభాకర్, మట్టెడ కుమార్, దంద్రె రమేష్, అథ్లెటిక్స్ కోచ్ శ్రీమన్నారాయణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధి కమిటీకి అభినందన



కార్పొరేటర్‌తో కాలనీ నూతన కమిటీ బాధ్యులు

హన్మకొండ అర్బన్: నగరంలోని 49వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో నూతన ఏర్పడిన కాలనీ అభివృద్ధి కమిటీని స్థానిక కార్పొరేటర్ మానస రాంప్రసాద్ అభినందించారు. కాలనీని కార్పొరేటర్ ఆదివారం సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అనంతరం నూతన కమిటీ బాధ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు నారాయణగిరి శ్రీనాథ్, ఉపాధ్యక్షులు యాకూబ్ పాషా, తమ్మిశెట్టి నరసింహ, గౌరవ అధ్యక్షుడు వరం సమ్మన్న, ప్రధాన కార్యదర్శి కిరణ్, కోశాధికారి దేవేందర్, సహాయ కార్యదర్శి దీకొండ సత్యనారాయణ, ముఖ్య సలహాదారులు చింతల రాములు, మహిళా కమిటీ సభ్యులు రజియా, శారద, మహేశ్వరి, కార్యవర్గ సభ్యులు బండా రమేష్, బొట్ల ప్రభాకర్, గొల్లపల్లి రామచందర్, ధరావత్ బద్రు పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందుండాలి



రన్‌ను ప్రారంభిస్తున్న రవికుమార్, ప్రదీప్‌రావు

ఖిలా వరంగల్: సమాజ సేవలో యువత ముందుండాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సూచించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్ వద్ద నుంచి ఖుష్‌మహల్ వరకు సాగిన 2కే రన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మామునూరు: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



హసన్‌పర్తి: సన్నాహక సమావేశంలో..

మామునూరు: టీజీఎస్పీ బెటాలియన్‌లోని ప్రభుత్వ ఉన్నత (క్యాంపు) పాఠశాలలో 1985 – 86వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వరంగల్ ఆర్టీఏ జంక్షన్‌లోని ఎస్ఎస్ ఫంక్షన్‌లో హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై చేరి ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గురువులను మహ్మద్ షకీల్, సానం రవీందర్ కుమార్, దూలెపాక జనార్దన్, కొత్తూరు సదయ్య, మల్లేశంను సన్మానించారు.

పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తాం

హసన్‌పర్తి: పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాల(1974 – 75లో ఎస్ఎస్‌సీ బ్యాచ్) పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశం బాలాజీ గార్డెన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఈ ఏడాది స్వర్ణోత్సవాలు నిర్వహించాలని తీర్మానించారు. తమ బ్యాచ్‌కు చెందిన విజయలక్ష్మి దంపతులు పాఠశాల అభివృద్ధికి రూ.3 లక్షలు, ఓంప్రకాష్ రూ.1.50 లక్షలు అందించినట్లు ప్రస్తావించారు. కార్యక్రమంలో డాక్టర్ మనోహర్, సాంబయ్య, రవీందర్, పార్థసారథి, మల్లేశం, రంగారెడ్డి, కిషన్ రెడ్డి, రాజిరెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

వరంగల్: ఆజంజాహి మిల్లు కార్మిక భవనం కూల్చివేసిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీపీఎఫ్ నాయకురాలు బి.రమాదేవి డిమాండ్ చేశారు. కాశిబుగ్గలోని ఒక ప్రైవేట్ కమిటీ హాల్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో న్యూడెమోక్రసీ పార్టీ బాధ్యుడు గంగుల దయాకర్ అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆజంజాహి మిల్లు కార్మిక భవనం కూల్చివేసిన వ్యాపారవేత్తతో పాటు అందుకు సహకరించిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏంసీపీఐ (యూ), టీపీఎఫ్, సీపీఐ, సీపీఐ(ఎంఎల్), ఇఫ్టూ, న్యూడెమోక్రసీ నాయకులు నర్ర ప్రతాప్, జనగం కుమారస్వామి, దుస్స రవి, ఇనుముల శ్రీనివాస్, ఆజంజాహి మిల్ కార్మిక యూనియన్ అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, నున్న అప్పారావు, ఎల్.డాక్టర్ కొణతం కృష్ణ, కాశిబుగ్గ జేఏసీ కన్వీనర్ అక్కినపల్లి యాదగిరి, కాంపెల్లి ప్రవీణ్, కోడం కుమార్, జి.శ్యామ్, గద్దల సంజీవ, గోషికొండ రవి, ఆకిన వెంకటేశ్వర్లు, గంజి సాంబయ్య, వెంకటస్వామి, చుంచు జగదీశ్వర్, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుమార్ కుటుంబానికి అండగా ఉంటా



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇన్‌చార్జ్‌గా అనేక ఏళ్లుగా పనిచేస్తున్న పేర్ల కుమారస్వామి అకాల మరణం బాధాకరమని, ఆయన కుటుంబానికి అండగా ఉంటానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పెద్దమ్మగడ్డలోని కుమారస్వామి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఆదివారం పరామర్శించారు. నాయిని వెంట కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు ఉన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి

హన్మకొండ: ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ మెయిన్‌రోడ్డు స్నేహనగర్‌లో నూతనంగా స్థాపించిన ఖనిక దంత వైద్యశాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుజ్జుల వసంత, తోట వెంకటేశ్వర్లు, దంత వైద్యులు డాక్టర్ యశస్విని, డాక్టర్ కీర్తన, ప్రముఖులు శ్రీమన్నారాయణ, జయప్రకాష్ రావ, గోపాలకిషన్ రావు, స్నేహనగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఖండేరావు నర్సింహారావు, ఇందిరానగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడ శ్రీనివాస్, కమిటీ సభ్యులు రవి కిరణ్, కిశోర్, తేళ్ల సుగుణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఊరెళ్తే పోలీసులకు సమాచారం అందించాలి

వరంగల్: సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ఊరికి వెళ్తే పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలని వరంగల్ పట్టణ ప్రజలకు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎంఏ.షుకూర్ సూచించారు. ఇంట్లో విలువైన వస్తువులు పెట్టకుండా లాకర్లలో పెట్టుకోవాలని, వీలైనంత వరకు ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇంటిని తరుచూ చూసుకోవాలని పక్కింటి వారికి చెప్పాలన్నారు.

ప్రతిఒక్కరూ పొదుపును అలవర్చుకోవాలి

హసన్‌పర్తి: ప్రతిఒక్కరూ పొదుపును అలవర్చుకోవాలని శ్రీకంఠ మహేశ్వర గౌడ పరపతి సంఘం అధ్యక్షుడు చిర్ర సుమన్ సూచించారు. ఒకటో డివిజన్ ముచ్చర్లలోని గౌడ పరపతి సంఘం ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొదుపు అనేది అభివృద్ధికి సహకరిస్తుందని చెప్పారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని సభ్యులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి మదూరి మనోహర్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

హసన్‌పర్తి: సంఘం పెద్దలపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతూ మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్న గ్రామానికి వెంకటేశ్వర్లపై చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం కులపెద్ద పంజాల సాంబరాజు కోరారు. ఈమేరకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. హసన్‌పర్తి మండలం జయగిరికి చెందిన తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, గౌడ సంఘం మధ్య రెండేళ్లుగా తాటిచెట్ల వివాదం నెలకొని ఉందని పేర్కొన్నారు. అయితే, కొంతకాలంగా వెంకటేశ్వర్లు సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన పోస్టింగ్, బెదిరింపులకు గురిచేయడమే కాకుండా కులాన్ని కించపరిస్తున్నాడని ఫిర్యాదులో తెలిపారు. కాగా, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు వివరించారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో వసతులు కల్పించాలి

కాజీపేట అర్బన్: ఈఎస్ఐ ఆస్పత్రిలో ఆధునిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కాకతీయ ఆల్ షాప్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు మంత్రి కొండా సురేఖకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. కార్పొరేటర్ మామిండ్ల రాజు, యూనియన్ అధ్యక్షుడు నాగబోయిన బాబురావు, ఎనబోతుల సతీష్, బొల్లం భిక్షపతి, సునీల్, గణేష్, శ్రీను పాల్గొన్నారు.

టాటాఏస్ – బైక్ ఢీ

మామునూరు: కోళ్లను తరలించే టాటా ఏస్ వాహనం.. బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం అర్ధరాత్రి తిమ్మాపురం ప్రధాన రహదారిపై జరిగింది. స్థానికుల కథనం ప్రకారం కొండపర్తి నుంచి వరంగల్ వైపు కోళ్లను తరలించే టాటా ఏస్ వాహనం తిమ్మాపురం గ్రామానికి చేరుకోగానే ఎదురుగా వచ్చే ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బోల్తా కొట్టింది. టాటాఏస్ వాహన డ్రైవర్, క్లీనర్ క్షేమంగా ఉన్నప్పటికీ బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలు కాగా, క్షతగాత్రులను ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

పతంగుల పంపిణీ

వరంగల్: కాశిబుగ్గలోని లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో కాశిబుగ్గ చౌరస్తాలో పిల్లలకు పతంగులను ఉచితంగా ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వంగరి రాంప్రసాద్, ప్రధాన కార్యదర్శి మండల సురేష్, ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, దాసి శివకృష్ణ, కోశాధికారి దుస్స కృష్ణ, పసునూటి శ్రీకాంత్, మండల చంద్రశేఖర్, మామిడాల సతీష్, బండారి లక్ష్మణ్, గాదె జగన్, వంగరి రవి, గోనె సతీష్, వంగ ఐలయ్య, కూచన సతీష్, గుండా యుగేందర్, కూరపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

7న లక్ష డప్పుల ప్రదర్శన

నయింనగర్: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరగనున్న వేయి గొంతులు.. లక్ష డప్పుల మహా ప్రదర్శన విజయవంతానికి ఈనెల 19న హనుమకొండ జిల్లా కేంద్రంలో జరగనున్న సన్నాహక ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. ఈమేరకు నయింనగర్ లష్కర్ సింగారంలో డప్పుల ప్రదర్శనను ఆదివారం నిర్వహించారు.

వివేకానందుడికి నివాళి

స్వామి వివేకానంద జయంతిని నగర వ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచ దేశాల్లో భారతదేశ ఖ్యాతిని వివేకానందుడు చాటిచెప్పారని గుర్తుచేసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ర్యాలీ నిర్వహిస్తున్న ఏవీవీ జూనియర్ కళాశాల విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసులు, తదితరులు



హసన్‌పర్తి: వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సాయి సేవా ట్రస్ట్ సభ్యులు



హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వినయ్‌భాస్కర్, నాయకులు



హనుమకొండలో ఏబీవీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు



ఇండోర్ స్టేడియంలో మాట్లాడుతున్న జాతీయ యువజన అవార్డు గ్రహీత పరశురాములు



మామునూరు: స్వామి వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేస్తున్న కాలనీవాసులు



హనుమకొండలో వివేకానందుడి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మెపా నాయకులు



కాశిబుగ్గలో వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు